మనసులో మాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
గురువారం 21 మే 2026


## టామ్‌కామ్‌తో విదేశీ కొలువులు!

- యూరప్ ఉద్యోగాలకు తెలంగాణ యువత సిద్ధం
- టామ్‌కామ్ బలోపేతానికి రూ. 90 కోట్లు
- మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి

05



# జిల్లాలకూ ఐటీ వెలుగులు!




## హైదరాబాద్ వెలుపల జీసీసీల ఏర్పాటు

హైవేల వెంట కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పరిశ్రమల శాఖపై సమీక్ష

వివరాలు 2లో..

తెలంగాణ ఐటీ రంగాన్ని కేవలం హైదరాబాద్ మహానగరానికే పరిమితం చేయకుండా జిల్లాలకూ విస్తరింపజేయడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖలపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంట గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీలు) ఏర్పాటుకు ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఐటీ కంపెనీలు స్థాపించే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు.

*–హైదరాబాద్, మనసులో మాట ప్రతినిధి:*

## నేటి నుంచే సరస్వతి అంత్య పుష్కరాలు!

- రూ. 200 కోట్లకు పైగా నిధుల కేటాయింపు
- ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రకటించిన మంత్రి కొండా సురేఖ

02



## బొగ్గు గ్యాసిఫికేషన్‌పై సింగరేణి ముందడుగు!

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి భేటీ
- కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని విజ్ఞప్తి

02



## మద్యం ధరలు పెంపు?

- జూన్ 2 తర్వాత అమల్లోకి వచ్చే అవకాశం
- అన్ని బ్రాండ్లపై 10 నుండి 15 శాతం..
- ఆదాయం పెంచుకునేందుకు కసరత్తు





## ఆసిఫాబాద్‌లో ఇందిరమ్మ పండుగ!

- జూన్ 2న రెండో విడత పథకానికి సీఎం శ్రీకారం
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల మంజూరు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి


03

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది.

## ఉపాధి పనులు వేగవంతం చేయండి!

- కలెక్టర్లతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ సమీక్ష

05



# నేటి నుంచే సరస్వతి అంత్య పుష్కరాలు!

**ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రకటించిన మంత్రి సురేఖ**

**రూ. 200 కోట్లకు పైగా నిధుల కేటాయింపు**

**కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద వేడుకలు**



**వరంగల్, మే 20 (మనసులో మాట):** సరస్వతి అంత్య పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వివరించారు. బుధవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి విలేకరులతో మాట్లాడారు.

## రూ. 200 కోట్లతో విస్తృత ఏర్పాట్లు

ఈ అంత్య పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లకు పైగా నిధులను కేటాయించిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రతిరోజు ఒక స్వామీజీ పవిత్ర స్నానంతో ఆ రోజు పుష్కర వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పుష్కరాలు జరిగే రోజుల్లో దాదాపు 10 మంది పీఠాధిపతులు హాజరవుతారని వివరించారు. కాళేశ్వరంలో జరిగే ఈ సరస్వతి పుష్కరాల్లో ప్రతిరోజు సాయంత్రం వేళల్లో గోదావరి హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా ఉంటుందని పేర్కొన్నారు.

## సాంస్కృతిక వేడుకలు.. భక్తులకు సేవలు

పుష్కరాల సందర్భంగా భక్తుల కోసం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అవసరమైన సేవలు అందించడానికి ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బాసర క్షేత్రం నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

## 12 రోజుల పాటు పుష్కర వైభవం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద నేటి (గురువారం) నుండి సరస్వతి నది అంత్య పుష్కరాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు ఈ అంత్య పుష్కర వేడుకలు నిరంతరాయంగా కొనసాగుతాయని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# జిల్లాలకూ ఐటీ వెలుగులు!

- హైదరాబాద్ వెలుపల జీసీసీల ఏర్పాటు
- హైవేల వెంట కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరానికే పరిమితం కాకుండా జిల్లాలకూ ఐటీ వెలుగులు విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. హైదరాబాద్ అవతల కూడా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటు చేసేలా ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శశాంక, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## బియాండ్ క్యూర్ ప్రాంతాల గుర్తింపు

ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. "బియాండ్ క్యూర్" (కోర్ అర్బన్ రీజియన్) ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఐటీ విస్తరణ పెద్దగా లేని చోట్ల కూడా డేటా సెంటర్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో పాటు పర్యావరణహిత నెట్-జీరో విధానాలు అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఏఐ సిటీ, సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకటి ఫ్యూచర్ సిటీలోని హెల్త్ సిటీలో ఏర్పాటు చేసేందుకు కేంద్రంతో చర్చలు జరపాలని ఆదేశించారు. అవసరమైతే తానే స్వయంగా ప్రధాన మంత్రితో మాట్లాడుతానన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించే విధంగా, ప్రపంచంలోనే గొప్ప ఏఐ సదుపాయాలుండేలా చూడాలన్నారు. ఫ్యూచర్ సిటీ పారిశ్రామిక వాడలో వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రాంగణాల్లో త్వరలోనే భూమి పూజ చేసేలా అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఫ్యూచర్ సిటీలో స్థాపించే కంపెనీలన్నీ నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రప్పించేందుకు "ఇన్వెస్ట్ తెలంగాణ" పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు, సేవలు అందేలా వ్యవస్థ రూపొందించాలని సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరు మీద ప్రభుత్వం ఒక సొసైటీని ఏర్పాటు చేయనుండగా, ఆ ఏజెన్సీని ఐటీ, పరిశ్రమల శాఖలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఎనర్జీ, ఫైనాన్స్ వంటి శాఖల అధికారులు ఇన్వెస్ట్ తెలంగాణలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండనున్నారు. ఈ ఏజెన్సీని ఏర్పాటు చేయడంలో ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఉత్తమ విధానాలను అవలంబించాలన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే కంపెనీలకు సంపూర్ణంగా తోడ్పాటునందిస్తూ సహకరించే విధంగా ఇన్వెస్ట్ తెలంగాణ పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాబోయే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు కచ్చితంగా టీ-ఫైబర్ ఇంటర్నెట్ వినియోగంలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే టీ-ఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. 54 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చినట్లు అధికారులు

# బొగ్గు గ్యాసిఫికేషన్‌పై సింగరేణి ముందడుగు!

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి భేటీ**

**కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** సింగరేణి భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు అంశాలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు. కోల్ ఇండియా తరహాలో సింగరేణి కూడా బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై పనిచేయడానికి సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకు కేంద్రం నుంచి సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం అందించాలని కోరారు. కొయ్యగూడెం బ్లాక్-3ను సింగరేణికి కేటాయించాలని, తాడిచెర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర మంత్రిని డిప్యూటీ సీఎం అభ్యర్థించారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులతో త్వరలోనే సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.



సింగరేణి సంస్థ విస్తరణకు కేంద్రం తరఫున తగిన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కీలక సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సింగరేణి సీఎండీ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ పాల్గొన్నారు.

# వడగాడ్పులపై అప్రమత్తంగా ఉండాలి!

**ఎండ తీవ్రతపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

**కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌కు సూచన**

**ఆసుపత్రులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేయాలని వెల్లడి**

**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వడగాడ్పులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అంతా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వడదెబ్బ బారిన పడి ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే వారికి తక్షణమే తగిన వైద్య సహాయం అందించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజలు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. ఆయా జిల్లాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ యంత్రాంగం అంతా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

# కాళేశ్వర తీరాన... పుష్కర వైభవం!

- నేటి నుంచే సరస్వతి అంత్య పుష్కరాలు
- కంచి స్వామి, గవర్నర్‌ల తొలి పుణ్యస్నానం
- భక్తుల సౌకర్యార్థం రూ. 30.63 కోట్లతో భారీ ఏర్పాట్లు



**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ పుణ్యస్నానాలు నేటి నుండి 12 రోజుల పాటు (జూన్ 1 వరకు) వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేయడంతో అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రత దృష్ట్యా పుష్కర ఘాట్ల వద్ద చలువ పందిళ్లు, కాయర్ మ్యాట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు.

## గవర్నర్, కంచి స్వామి తొలి స్నానం

పుష్కరాల తొలిరోజైన 21వ తేదీ



తెల్లవారుజామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పవిత్ర స్నానం ఆచరించి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. జూన్ 1వ తేదీ వరకు ప్రతిరోజూ ఒక ప్రముఖ పీఠాధిపతి ఈ పుష్కరాల్లో పాల్గొంటారు. నిత్యం ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం హారతి, తెప్పోత్సవాలతో పాటు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తుల రాకపోకల కోసం 90 షటిల్ బస్సులను సిద్ధం చేశారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ రూ. 1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తోంది. స్థానిక నాగేంద్ర స్వామి ఆలయాన్ని రూ. 30 లక్షలతో పునర్నిర్మించారు. తాగునీటి సరఫరా కోసం రెండు ప్రత్యేక జలాశయాలను, 500 తాత్కాలిక శౌచాలయాలను నిర్మించారు. లింకు రోడ్లతో పాటు వాహనాల కోసం కేటాయించిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీరు, శౌచాలయాల సౌకర్యం కల్పించారు.

## వైద్య శిబిరాల ఏర్పాటు

పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 జోన్లలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వీటికి గాను 300 మంది వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులను అందుబాటులో ఉంచి, మహాదేవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా మార్చారు.

## భారీ పార్కింగ్.. సీసీ కెమెరాల నిఘా

లక్షా 70 వేల వాహనాలు వస్తాయనే అంచనాతో 245 ఎకరాల్లో 23 పార్కింగ్ కేంద్రాలను, బీటీ రోడ్లను సిద్ధం చేశారు. భద్రత పర్యవేక్షణ కోసం ఘాట్లు, పార్కింగ్ స్థలాల్లో 200 సీసీ కెమెరాలను అమర్చారు. రాత్రి వేళల్లో వెలుతురు కోసం ప్రత్యేకంగా ఎల్ఈడీ లైట్లను వేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు 300 మంది సిబ్బందిని నియమించి, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

## 100 మంది గజేతగాళ్ల నియామకం

నదీ తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 100 మంది గజ ఈతగాళ్లను, రెస్క్యూ బృందాలను, విపత్తు స్పందన దళాలను, రక్షణ పడవలను నియమించారు. పుష్కర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు ఒక ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు.

# వైభవంగా సరస్వతి అంత్య పుష్కరాలు!

## భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** సరస్వతి అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని ఆయన వెల్లడించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ నియంత్రించాలని సూచించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, పుష్కరాలకు వచ్చే భక్తులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సీఎం కోరారు. ఈ పుష్కర వేడుకలన్నీ పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో, ప్రశాంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్కర శుభాకాంక్షలు తెలిపారు.

# ఆసిఫాబాద్‌లో ఇందిరమ్మ పండుగ!

- జూన్ 2న రెండో విడత ఇండ్ల పథకానికి సీఎం రేవంత్ శ్రీకారం
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల మంజూరు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ / కొమరం భీమ్ ఆసిఫాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్ఠాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లతో కలిసి ఆయన సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్, కాగజ్‌నగర్ మండలం దాదానగర్, సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1 లక్ష 20 వేల ఇండ్ల నిర్మాణాలయ్యాయని, జూన్ నాటికి 2 లక్షల 35 వేల ఇండ్లు పూర్తవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణం ఆర్భాటాలకే పరిమితమైందని, కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 4 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ. 22,700 కోట్లతో శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటి నిర్మాణ పురోగతికి అనుగుణంగా దశలవారీగా రూ. 5 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. అర్హత గల ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## ఆదివాసీల సొంతింటి కష్టాలకు చెక్

ఆదివాసీ జిల్లా కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లోని కొఠారి గ్రామంలో గిరిజన కుటుంబాలకు



ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా ఆదివాసీల సొంతింటి కష్టాలను తొలగిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా మహిళలను కుటుంబానికి ఆధారస్తంభంగా గుర్తిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2026-28 సంవత్సరాలకు గాను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను మంత్రులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యపు దిగుమతులు వేగవంతం చేయండి!

## మిల్లులు, గోదాములను పరిశీలించిన అదనపు కలెక్టర్

## హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశం

## రవాణాలో ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టీకరణ



**మంచిర్యాల, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి కేటాయించిన గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలోని గాయత్రి రైస్ మిల్లును, హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లోని రాజరాజేశ్వరి గోదాములను మండల తహశీల్దార్‌తో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న ధాన్యం దిగుమతి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## హమాలీల సంఖ్యను పెంచాలి

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వి.రాములు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా గోదాములకు తరలిస్తున్నామని, అక్కడ దిగుమతి పనులను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సరిపడా హమాలీల సంఖ్యను పెంచుకోవాలని మిల్లులు, గోదాముల నిర్వాహకులకు సూచించారు.

## సమర్థవంతమైన నిర్వహణ

జిల్లాలోని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో లారీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా వసతులకు రూ.5 వేల కోట్లు!

- కేంద్ర మంత్రితో డిప్యూటీ సీఎం భట్టి భేటీ
- తెలంగాణకు అదనపు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి
- మినహాయింపులపై ఢిల్లీలో కీలక చర్చలు



**న్యూఢిల్లీ, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రగతి, విద్యా మౌలిక వసతులు, మూలధన వ్యయాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై వీరు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రాల మూలధన పెట్టుబడుల ప్రత్యేక సహాయ పథకం కింద తెలంగాణకు అదనంగా రూ. 5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయాన్ని మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తమ ప్రభుత్వం చేపడుతున్న భారీ పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను కేంద్ర ఆర్థిక మంత్రికి భట్టి విక్రమార్క వివరించారు.

## ఎఫ్ఆర్బీఎం పరిమితుల మినహాయింపు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ సహా విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భారీ పెట్టుబడులు పెడుతోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ ఆమోదించిన విదేశీ ద్రవ్య సహకార ప్రాజెక్టులకు ఎఫ్ఆర్బీఎం పరిమితుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు.

# కులగణనపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

**కేంద్ర ఓబీసీ కుటుంబాలను లెక్కించాలి**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**కులగణన వ్యతిరేకులకు సుప్రీం తీర్పు చెంపపెట్టు**



**హైదరాబాద్, మే 20 (మనసులో మాట):** దేశంలో జనగణనతో పాటు బీసీ కులగణన చేపట్టవచ్చని ఈరోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సుప్రీంకోర్టు తీర్పు కులగణన వ్యతిరేకులకు చెంపపెట్టు లాంటిదని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా బీసీ జనాభాను లెక్కించాలని, జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కాలని తాము దశాబ్దాలుగా పోరాడుతున్నామని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆ సుదీర్ఘ పోరాట ఫలితమే ఈరోజు సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు అని ఆయన అభివర్ణించారు. కులగణన చేస్తామని గతంలో హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేయాలని చూసిందని ఆయన మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా కేంద్ర ప్రభుత్వం తన మనసు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మొదటి విడతగా జరుగుతున్న కుటుంబాల లెక్కింపులోనే ఓబీసీ, బీసీ కుటుంబాల లెక్కింపును కూడా వెంటనే చేపట్టాలని కోరారు. బీసీ జనాభా లెక్కలను సుప్రీంకోర్టు సమర్థించినందుకు దేశ అత్యున్నత న్యాయస్థానానికి శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పెన్షన్ల అథెంటికేషన్ పారదర్శకంగా ఉండాలి!

**ప్రతి గ్రామంలో 20 ఉపాధి పనులు**

**40 రోజుల్లో నిధుల పూర్తి వినియోగం**

**కలెక్టర్ సిహెచ్. ప్రియాంక ఆదేశం**

**నారాయణపేట, మే 20 (మనసులో మాట):** చేయూత పెన్షన్ లబ్ధిదారుల లైవ్‌నెస్ అథెంటికేషన్‌ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక అధికారులను ఆదేశించారు. నగదు రూపంలో జరిగే పెన్షన్ పంపిణీపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సెర్ప్ సీఈఓ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నారాయణపేట కలెక్టరేట్ నుండి ఆమె పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ కింద వేజ్, మెటీరియల్ కాంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి సంక్షేమ గ్రామ పంచాయతీలో కనీసం 20 పనులను గుర్తించి వెంటనే ప్రారంభించాలన్నారు. కూలీలను పెద్ద సంఖ్యలో సమీకరించి, పనులన్నీ ఉదయం వేళల్లోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే 40 రోజుల్లో మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలని, వాటర్ హార్వెస్టింగ్ పనుల వివరాలను వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కూలీలు ఎక్కువ మొత్తంలో హాజరై, 40 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామపంచాయతీ భవనాలు, మహిళా సంఘ భవనాల నిర్మాణాల పురోగతిపై పూర్తి వివరాలతో అత్యవసర నివేదికలను సమర్పించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఎన్ని భవనాలు మంజూరయ్యాయి, ఏ దశలో ఉన్నాయనే వివరాలు అందులో ఉండాలన్నారు. జూన్ చివరి నాటికి ఎంత మేర నిధులు బుక్ చేయగలమనే అంశంపై ప్రణాళికతో సిద్ధం కావాలన్నారు.

# 22న 'ప్రజాపాలన' సదస్సులు!

**99 రోజుల కార్యాచరణపై జిల్లాల్లో సమావేశాలు**

**హాజరుకానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**సంక్షేమ పథకాలపై అవగాహనకు ఆదేశాలు**

**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అన్ని జిల్లాల్లో ఈనెల 22న జిల్లాస్థాయి సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత మార్చి 6వ తేదీ నుండి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రణాళికను అమలు చేసేందుకు పలు కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించింది. ఇందులో భాగంగానే ఈ నెల 22వ తేదీన అన్ని జిల్లా కేంద్రాలలో జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుల్లో గౌరవ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

## పథకాల ప్రగతిపై చర్చ

ఈ సదస్సులలో గౌరవ ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. 99 రోజుల ప్రణాళికలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు, ప్రజాప్రతినిధుల సందేశాలు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను వెల్లడిస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), మహిళలకు రూ. 500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, స్థానిక నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సదస్సుల్లో ప్రస్తావిస్తారు.

## కొత్త పథకాలపై అవగాహన

ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న నూతన పథకాలపై కూడా ప్రజలకు వివరించనున్నారు. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉదయం ఉచిత అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలు, ఇంటర్ చదివే దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాల పంపిణీ వంటి అంశాలను లబ్ధిదారులకు తెలియజేస్తారు. రైతులకు సంబంధించి పంట మార్పిడి విధానాలు, సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారు. ఈ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రామాణిక నిర్వహణ విధానాలను పాటించాలని ఆయా విభాగాధిపతులకు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మద్యం ధరలు పెంపు?

**జూన్ 2 తర్వాత అమల్లోకి వచ్చే అవకాశం**

**అన్ని బ్రాండ్లపై 10 నుండి 15 శాతం పెరిగే యోచన**

**ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం కసరత్తు**



**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణలో మద్యం ప్రియులకు షాక్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. తెలంగాణ అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీ తర్వాత ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది.

## 10 నుండి 15 శాతం పెంపు?

రాష్ట్రంలో విక్రయించే అన్ని రకాల మద్యం బ్రాండ్లపై కనీసం 10 శాతం నుండి 15 శాతం మేర ధరలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది.

## పెరిగిన తయారీ ఖర్చులు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు అమాంతం పెరిగాయి. దీంతో మద్యం సీసాల తయారీకి అవసరమైన ఎల్పీజీ సహజ వాయువు కొరత ఏర్పడింది. గ్లాస్ బాటిళ్లు, రవాణా ఖర్చులు, ప్యాకింగ్ మెటీరియల్స్ ధరలు భారీగా పెరిగాయి. దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ధరలను సవరించాలని డిస్టిలరీలు, బ్రేవరీస్ కంపెనీలు గత ఏడాది కాలంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ధరల పెంపునకు మొగ్గు చూపినట్లు సమాచారం.

# టామ్‌కామ్‌తో విదేశీ కొలువులు!

- యూరప్ ఉద్యోగాలకు తెలంగాణ యువత సిద్ధం
- టామ్‌కామ్ బలోపేతానికి రూ. 90 కోట్లు
- మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి




**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 90 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన భారత్ – యూరోపియన్ యూనియన్ మొబిలిటీ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

### యూరప్‌లో భారీ అవకాశాలు

ప్రస్తుతం యూరప్ దేశాల్లో విదేశీ ఉపాధి నైపుణ్యాలు, జర్మన్ భాష శిక్షణ కలిగిన వారికి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ అవకాశాన్ని ముందుగానే గుర్తించి యువతను అంతర్జాతీయ కెరీర్లకు సిద్ధం చేస్తోందన్నారు. టామ్‌కామ్ ద్వారా శిక్షణ పొందిన ఎందరో యువకులు ఇప్పటికే విదేశాల్లో విజయవంతంగా ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల తన జర్మనీ పర్యటనలో ఆరోగ్య, తయారీ, సాంకేతిక, సేవా రంగాల్లో నైపుణ్య నిపుణులకు ఉన్న భారీ డిమాండ్‌ను ప్రత్యక్షంగా గమనించినట్లు చెప్పారు.

### సురక్షితమైన ఉపాధి మార్గాలు

అక్రమ మార్గాల ద్వారా విదేశాలకు వెళ్లడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రభుత్వం యువతలో అవగాహన కల్పిస్తోందని మంత్రి వివరించారు. కేవలం చట్టబద్ధమైన, సురక్షితమైన మార్గాల ద్వారానే విదేశీ ఉపాధిని ఎంచుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మారుతున్న నైపుణ్యాలను యువత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ ఆదర్శ్ కుమార్ మెహ్రా, ఎల్ఈటీఎఫ్ కార్యదర్శి దాసరి హరిచందన, ఉపాధి, శిక్షణ విభాగం డైరెక్టర్ కాంతి వెస్లీ, రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి జే. స్నేహజ, ఐసీడబ్ల్యూఏ జాయింట్ సెక్రటరీ అభిజిత్ చక్రబోర్తి పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి!

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసిన కాలనీవాసులు**

**సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన**



**ఎల్బీనగర్, మే 20 (మనసులో మాట):** మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీవాసులు తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బారాస నాయకులు శానాల చంద్రారెడ్డి, లెక్చరర్స్ కాలనీ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు, నూతన దేవాలయం కమిటీ సభ్యులు చింతల యాదగిరి, బిక్షపతి, రంగారెడ్డి, స్వామిగౌడ్, వెంకట్ రెడ్డి, చంద్రారెడ్డి, సత్తిరెడ్డి, శాస్త్రి, గీత, లక్ష్మి, పరమేశ్వరి, ప్రభాకర్ రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయండి!

- జూన్ 30 వరకు నరేగా పనులు
- ఉదయం 10.30 గంటలకే పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్లతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ సమీక్ష




**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** ఉపాధి హామీ పథకం (నరేగా) కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, అన్ని పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. ఈ పథకం జూన్ 30 వరకు కొనసాగుతుందని, జూలై 1 నుండి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని ఆయన తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి సెర్ప్ సీఈఓ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వే పురోగతిని సమీక్షించారు.

### కార్మికుల సంఖ్య 20 లక్షలకు పెంచాలి

ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు నరేగా పనుల్లి పాల్గొంటుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని దానకిషోర్ సూచించారు. ప్రతి రోజు పనుల కోసం ముందు రోజునే కార్మికుల సమీకరణ చేపట్టాలన్నారు. పనులు గ్రామ పరిధిలోనే ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి, ప్రధాన పనులను ఉదయం 10.30 గంటల లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 40 రోజుల పాటు ఎంపీడీవోలు పూర్తిగా ఉపాధి హామీ పనులపైనే దృష్టి సారించాలని సూచించారు.

### మహిళా సంఘ భవనాల నిర్మాణాలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ముఖ్యమంత్రి సుమారు 8 వేల మహిళా గ్రామ సంఘ భవనాలకు శంకుస్థాపనలు చేయనున్నారని దానకిషోర్ తెలిపారు. రాబోయే 40 రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడల వంటి నిర్మాణాలను నరేగా కింద చేపట్టవచ్చని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో సీసీ డ్రెయిన్ల శుభ్రత పనులను నిరంతరం చేపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు.

### రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి

మహిళా సంఘాల బ్యాంకు లింకేజి రుణాల రికవరీపై సెర్ప్ సీఈఓ దివ్య మాట్లాడుతూ బ్యాంకు బకాయిలను (ఎన్‌పీఏలు) పూర్తిగా నివారించడంలో జిల్లాలు ముందుండాలని తెలిపారు. ముఖ్యంగా స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బ్యాంకు రుణాల మంజూరు, చెల్లింపులు, బకాయిల నియంత్రణపై ప్రతి నెల జిల్లా కలెక్టర్లు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

# సిరిచెల్మ ఆలయంలో 'హెరిటేజ్ వాక్'!

**పర్యాటక ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన**

**ఉత్సాహంగా పాల్గొన్న కేజీబీవీ విద్యార్థినులు**

**ఇచ్చోడ, మే 20 (మనసులో మాట):** "ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చోడ మండలంలోని ప్రసిద్ధ సిరిచెల్మ ఆలయంలో 'హెరిటేజ్ వాక్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ బంగారిగూడ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆలయ చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను తెలుసుకున్నారు. స్థానిక వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థుల్లో పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ హెరిటేజ్ వాక్ నిర్వహించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిరిచెల్మ ఆలయ చరిత్ర, స్థానిక సంస్కృతి, పర్యాటక ప్రాధాన్యతతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ బాధితులకు డీ-అడిక్షన్ సెంటర్లు!

**సైబర్ క్రైమ్ నియంత్రణపై సమగ్ర నివేదిక ఇవ్వాలి**

**ఫోరెన్సిక్, డేటా సెంటర్ల సంఖ్య పెంచాలని ఆదేశం**

**పోలీసు ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**



**హైదరాబాద్, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** డ్రగ్స్ బారిన పడిన బాధితుల కోసం రాష్ట్రంలో ప్రత్యేకంగా డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బొల్లారం పవిలియన్‌లో బుధవారం జరిగిన పోలీసు సీనియర్ అధికారుల ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, అదనపు డీజీలు, పోలీస్ కమిషనర్లు, ఐజీలు పాల్గొన్నారు.

### సైబర్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

పోలీసు విభాగంలో ఎస్ఐ నుండి నాన్-క్యాడర్ ఐపీఎస్ వరకు ప్రమోషన్ వచ్చిన తర్వాత రెండేళ్ల పాటు ఇతర విభాగాల్లో పనిచేసేలా నిబంధన తేవాలని సీఎం సూచించారు. దీనిపై సీఎస్, డీజీపీ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణపై సమగ్ర నివేదిక తయారు చేయాలని, ఫోరెన్సిక్, డేటా సెంటర్లను మరింత పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పోలీసు ట్రైనింగ్‌లోనే సైబర్ క్రైమ్ విభాగం కోసం ప్రత్యేక ఎంపిక జరగాలని, స్కిల్స్ యూనివర్సిటీలో పోలీసుల కోసం ప్రత్యేక కోర్సు ఏర్పాటు చేయాలని సూచించారు.

### ఆదాయానికి గండి కొడితే కఠిన చర్యలు

విజిలెన్స్ విభాగంలో సాంకేతికతను పెంచాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. డేటా అనలిటిక్స్ ఆధారంగా ఆర్గనైజ్డ్ క్రైమ్స్ పైన విజిలెన్స్ దృష్టి సారించాలన్నారు. ఈ విభాగానికి మరిన్ని అధికారాలు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత కాకుండా, అగ్ని ప్రమాదాలు అసలు జరగకుండా ఫైర్ డిపార్ట్‌మెంట్ ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### మున్సిపల్, హైడ్రాతో సమన్వయం

మున్సిపల్ శాఖ, హైడ్రాతో సమన్వయం చేసుకుంటూ ఫైర్ డిపార్ట్‌మెంట్‌పై జూన్ 15 లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. మ్యాన్‌హోల్స్ నిర్వహణ విషయంలో మెట్రో వాటర్ వర్క్స్, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, హైడ్రా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు ఉమ్మడిగా పనిచేయాలన్నారు. నగరంలో అడ్డగోలుగా ఫ్లెక్సీలు కడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఫ్లెక్సీల విషయంలో పోలీస్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ అధికారులు కఠినంగా వ్యవహరించాలని, నైట్ పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం!

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌ఓ అనిత
- స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా, తనిఖీలు
- భ్రూణహత్యల నివారణకు అందరూ సహకరించాలని పిలుపు




**మంచిర్యాల, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ, లింగ ఎంపిక నిషేధ చట్టం (పీసీపీఎన్‌డీటీ) - 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ అనిత స్పష్టం చేశారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న స్కానింగ్ కేంద్రాలు, స్త్రీ వైద్య నిపుణులు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోని స్కానింగ్ మిషన్ల ద్వారా అందుతున్న సేవలపై ఆమె సమీక్ష నిర్వహించారు.

### స్కానింగ్ కేంద్రాల్లో కఠిన నిబంధనలు

జిల్లాలో 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డాక్టర్ అనిత పేర్కొన్నారు. ఇందులో భాగంగా గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ల తనిఖీలు, రికార్డుల పరిశీలన, సీ-సెక్షన్ ఆడిట్ క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో పీసీపీఎన్‌డీటీ చట్టం పుస్తకం, మిషన్ల వివరాలు ప్రదర్శించాలని ఆదేశించారు. కేంద్రాల్లో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, సేవల రుసుములు, ఆసుపత్రి ధ్రువీకరణ పత్రాల వివరాలను గోడలపై స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. స్కానింగ్‌కు వచ్చే గర్భిణులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

### అనుమతులు తప్పనిసరి

కొత్తగా స్కానింగ్ మిషన్ కొనాలన్నా, పాత మిషన్ తొలగించాలన్నా ముందస్తుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి అనుమతి (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) తీసుకోవడం తప్పనిసరి అని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు. ఒకవేళ మూసివేసిన కేంద్రాల్లోని పరికరాలను ఇతరులకు విక్రయిస్తే, కొనుగోలు చేసిన వారి పూర్తి సమాచారాన్ని కార్యాలయానికి అందించాలన్నారు. జిల్లాలో భ్రూణహత్యల నివారణకు కమిటీ సభ్యులందరూ బాధ్యతగా సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించని కేంద్రాలపై తనిఖీలు జరిపి లోపాలు ఉంటే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ అభినవ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డీపీఓ ప్రశాంతి, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ హారిక, పలువురు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అతివేగమే ప్రమాదాలకు కారణం!

- రోడ్డు భద్రతపై ఎమ్మెల్యే యెన్నం సమీక్ష
- అదనంగా 500 సీసీ కెమెరాల ఏర్పాటు
- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశం




**మహబూబ్‌నగర్, మే 20 (మనసులో మాట):** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కొత్త రహదారులు, బైపాస్‌లపై అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రాణనష్టం సంభవిస్తున్న నేపథ్యంలో, ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా ప్రత్యేక సమన్వయ కమిటీ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ చర్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

### బైపాస్ రోడ్లపై ప్రత్యేక నిఘా

నగరంలో ప్రమాదాలకు కారణమవుతున్న బైపాస్ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించి స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ గన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రధాన రహదారులపై అనుమతి లేకుండా మీడియన్లను తెరవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. పాలకొండ బైపాస్ రోడ్, భూత్పూర్ నుండి వన్‌టౌన్ వరకు రహదారి, హన్వాడ నుండి పాలమూరు యూనివర్సిటీ వరకు కొత్తగా నిర్మించిన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తోందన్నారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, అనుమతి లేని మీడియన్ ఓపెనింగ్‌లను మూసివేయాలని ఆదేశించారు.

### ప్రమాదాల నివారణకు అవగాహన

పట్టణానికి అనుసంధానమైన ప్రధాన రహదారులపై హెచ్చరిక బోర్డులు, వేగ పరిమితి సూచికలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా ప్రస్తుతం ఉన్న 200 సీసీటీవీ కెమెరాలకు అదనంగా మరో 500 కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర నిఘా ఉంచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నాలుగు ప్రధాన రహదారులపై స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి అతివేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన జంక్షన్ల వద్ద తగిన లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, అవసరమైన చోట స్ట్రీట్ లైట్లు, హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

### ప్రతి నెల మీడియా సమావేశాలు

జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, ప్రమాదాలకు గురవుతున్న జంక్షన్లను గుర్తించి అక్కడ భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం, పోలీసు శాఖ ద్వారా తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియజేస్తూ ప్రతి నెల మీడియా సమావేశాలు కూడా నిర్వహిస్తామని వివరించారు. ఈ సమావేశంలో మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, అదనపు ఎస్పీ ఎన్బీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ సంధ్య, జాతీయ రహదారులు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి!

- నిల్వ, రవాణా ప్రక్రియలపై కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం
- మిల్లులు, గోదాముల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం



**మంచిర్యాల, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం రామారావుపేటలో గల రైస్ మిల్లును, కోటపల్లి మండలం సర్వాయిపేట, వేమనపల్లి మండల కేంద్రంలోని గోదాములను ఆయన స్వయంగా సందర్శించారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తోందన్నారు. రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలన్నారు. వీటితో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు వంటి సదుపాయాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు.

## వేగంగా దిగుమతి చేసుకోవాలి

వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన నిబంధనల ప్రకారం రైస్ మిల్లులకు, గోదాములకు సకాలంలో తరలించాలన్నారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా సాధించేలా అధికారుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. లారీల యజమానులు ధాన్యం తరలింపులో రవాణా నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గోదాములకు తరలించిన ధాన్యాన్ని పద్ధతి ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల మేరకు రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్య సేకరణ వేగవంతం చేయాలి!

**కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య పరిశీలన**

**ఆలస్యం లేకుండా లారీలు సమకూర్చాలని ఆదేశం**

**పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం**

**మంచిర్యాల, మే 20 (మనసులో మాట ప్రతినిధి):** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును, మొర్రిగూడలోని రాఘవేంద్ర రైస్ మిల్లు గోదామును, చింతగూడలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న ధాన్య సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య మాట్లాడుతూ.. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను వెంటనే సమకూర్చాలని రవాణాదారులను ఆదేశించారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి, మిల్లులకు తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. హమాలీలు, లారీల యజమానుల సమన్వయంతో ధాన్యం తరలింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మే 27 నుండి పాలీసెట్ కౌన్సిలింగ్!

**పాలిటెక్నిక్ ప్రవేశాల షెడ్యూల్ విడుదల**

**జూన్ 6న సీట్ల కేటాయింపు**

**ప్రిన్సిపాల్ పి. జానకిదేవి వెల్లడి**

**సంగారెడ్డి, మే 20 (మనసులో మాట):** పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్ఉ2026 వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియ మే 27 నుండి ప్రారంభమవుతుందని సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకిదేవి తెలిపారు. పాలీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు మే 27 నుండి 31 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మే 29 నుండి జూన్ 3 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 6న సీట్ల కేటాయింపు జరుగుతుందని, విద్యార్థులు నిర్ణయించిన తేదీలను తప్పనిసరిగా అనుసరించి కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ సూచించారు. పాలిటెక్నిక్ విద్యతో విద్యార్థులకు ఎంతో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.




# ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి!

**జూన్ 2 లోగా గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి**

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్ ప్రియాంక**




**నారాయణపేట, మే 20 (మనసులో మాట):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో నిర్దేశిత పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నారాయణపేట నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రగతిపై జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జెడ్పీ సీఈఓ) శ్రీనివాస్ రావు, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సుధాకర్ రెడ్డిలతో కలిసి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద రూ. 5 లక్షల నిధులను మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు.

## ప్రగతిపై కలెక్టర్ అసంతృప్తి

గ్రామాల వారీగా మంజూరైన ఇండ్లను లబ్ధిదారులు తొందరగా నిర్మించుకునేలా అధికారులు ప్రత్యేకంగా ప్రోత్సహించాలన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు మంజూరైన ఇండ్లు, వివిధ దశల్లో ఉన్న ఇండ్ల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ లక్ష్యంలో ధన్వాడ మండలం 55 శాతంతో ముందంజలో ఉండగా, నారాయణపేట పట్టణంలో కేవలం 34 శాతమే నమోదు కావడంపై కలెక్టర్ వివరణ కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకంలో క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ నాటికి వీలైనన్ని ఎక్కువ ఇండ్లను త్వరగా నిర్మింపజేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలన్నారు.

## కొడంగల్ నియోజకవర్గంలో..

జిల్లాలోని మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి, కోస్గి మండలాలకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి జూన్ 2 లోగా పెద్ద సంఖ్యలో గృహ ప్రవేశాలకు ఇండ్లను సిద్ధం చేయాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం, పట్టణం ప్రగతిలో చివరి స్థానంలో ఉండటంపై సమీక్షిస్తూ, కొత్తపల్లి మండలంలో టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇండ్ల వారీగా పూర్తి నివేదికను తనకు సమర్పించాలని ఎంపీడీవోను ఆదేశించారు.

అలాగే కోస్గి మున్సిపాలిటీలోని 3, 4, 11, 16 వార్డులలో ఇండ్లు 40 శాతమే పూర్తి కావడంపై మున్సిపల్ కమిషనర్ నాగరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఈ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. గుండుమాల్ మండలంలో ఇండ్ల నిర్మాణాల శాతం 78కి చేరడంపై అభినందిస్తూ, దానిని త్వరలోనే 100 శాతానికి తీసుకురావాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్యం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రైతు నమోదు ప్రక్రియను కూడా వీలైనంత తొందరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్, ఎంపీవోలు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జాబితా సవరణ పారదర్శకంగా చేపడతాం!

**జూన్ 25 నుండి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం**

**రాజకీయ పార్టీలు బిఎల్ఎలను నియమించాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడి**



**నిర్మల్, మే 20 (మనసులో మాట):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా పక్కాగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జూన్ 25వ తేదీ నుండి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని కలెక్టర్ వివరించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) ఓటర్ల వివరాలకు సంబంధించి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందిస్తారని చెప్పారు. ఓటర్లు నింపిన వివరాలతో కూడిన ఫారాలను జూలై 24వ తేదీ వరకు తిరిగి సేకరిస్తారన్నారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చునని సూచించారు.

వివరాల పరిశీలన అనంతరం, జూలై 31వ తేదీన ఓటరు ముసాయిదా జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. ఇందులో పేరు లేకపోతే తగిన ఆధారాలతో సంబంధిత ఫారాలను నింపి, ధ్రువీకరణతో ఈఆర్ఓలను సంప్రదించవచ్చునన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలపవచ్చునని స్పష్టం చేశారు. అభ్యంతరాల పరిశీలన ముగిశాక, అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రదర్శిస్తామని వివరించారు.

### ఏజెంట్ల నియామకం తప్పనిసరి

ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరపున బూత్ లెవెల్ ఏజెంట్లను (బిఎల్ఏ) నియమించాలని కలెక్టర్ కోరారు. నియోజకవర్గ, మండల, గ్రామీణ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

అనంతరం తహసిల్దార్లు, అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈఆర్ఓలు ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఖానాపూర్ ఈఆర్ఓ గంగాధర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో ట్రాఫిక్ సంక్షోభం!

- మూడు నెలల పాటు ప్రత్యేక ఆంక్షలు
- ఎలివేటెడ్ కారిడార్ పనులతో తిప్పలు
- మున్సిపల్ అధికారుల క్షేత్రస్థాయి సమీక్ష




**హైదరాబాద్, మే 20 (మనసులో మాట):** నగర తూర్పు భాగానికి ప్రధాన రవాణా మార్గమైన ఉప్పల్ రింగ్ రోడ్ ప్రస్తుతం భారీ ట్రాఫిక్ సంక్షోభానికి కేంద్రంగా మారింది. ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి అధికారులు మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీనివల్ల లక్షలాది మంది ప్రజల దైనందిన జీవితం తీవ్రంగా ప్రభావితమవుతోంది. వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుండటంతో ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. ఉప్పల్ చౌరస్తా, నాగోల్ ఫ్లైఓవర్, ఉప్పల్ బగాయత్, రామంతపూర్ ప్రాంతాల్లో పర్యటించి, ఇబ్బందులు తగ్గించేలా తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.

### ఇరుకైన రహదారులు..

ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో పిల్లర్లు ఏర్పాటు చేస్తున్నారు. భారీ క్రేన్లు, కాంక్రీట్ యంత్రాలు, నిర్మాణ సామగ్రిని రహదారిపైనే నిల్వ చేయడం వల్ల రోడ్ల వెడల్పు గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్లను పూర్తిగా మూసివేయగా, కొన్ని చోట్ల ఒకే లైన్ మాత్రమే అందుబాటులో ఉంచారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతున్నాయి. సాధారణంగా 15 నిమిషాల్లో చేరుకునే దూరానికి ఇప్పుడు గంటకు పైగా సమయం పడుతోంది.

### వరంగల్, యాదాద్రి ప్రయాణికులకు నరకం

వరంగల్, యాదాద్రి భువనగిరి, జనగాం, ఘట్‌కేసర్, పోచారం ప్రాంతాల నుండి ప్రతిరోజూ వేలాది మంది నగరానికి వస్తుంటారు. ట్రాఫిక్ ఆంక్షల కారణంగా ఈ వాహనాలని ఉప్పల్ బగాయత్, నాగోల్ ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకునేలా మళ్లించారు. ఇప్పటికే రద్దీగా ఉండే నాగోల్ మార్గంలో అదనపు వాహనాలు చేరడంతో ట్రాఫిక్ అదుపు తప్పుతోంది. ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, లారీలు ఒకేచోట నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



### అత్యవసర సేవలకు ఆటంకం

ప్రధాన రహదారులపై ఒత్తిడి తగ్గించడానికి అధికారులు వాహనాలను కాలనీల మధ్య గల ఇరుకైన రోడ్లలోకి మళ్లిస్తున్నారు. దీనితో కాలనీల్లో నివసించే స్థానికులు శబ్ద, వాయు కాలుష్యంతో ఆందోళన చెందుతున్నారు. అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో రోగులను ఆసుపత్రులకు తరలించడంలో ఆలస్యం జరుగుతోంది. ఉప్పల్ రింగ్ రోడ్ సమీపంలోని మున్సిపల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

### వ్యాపారాలు అస్తవ్యస్తం..

సమయానికి పాఠశాలలు, సంక్షేమ నిలయాలు, కళాశాలలకు చేరుకోలేక విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లలేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ భయంతో జనాలు రాకపోవడంతో స్థానిక హోటళ్లు, చిన్న దుకాణాల వ్యాపారం దెబ్బతిన్నదని వ్యాపారులు వాపోతున్నారు. వాహనాలు నిలిచిపోతుండటంతో కాలుష్యం పెరిగి, వృద్ధులు, పిల్లలు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తయితే నగర తూర్పు భాగానికి ట్రాఫిక్ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ఉప్పల్ రింగ్ రోడ్ వైపు రావద్దని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు సూచించారు. ప్రయాణానికి ముందే గూగుల్ మ్యాప్స్ ద్వారా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు.

# కాంగ్రెస్ సర్కారును బొందపెడదాం!

**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపు**

**భద్రాచలం, మే 20 (మనసులో మాట):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమమే తప్ప, కాంగ్రెస్ సర్కారులో ఎటువంటి పనులు ముందుకు సాగడం లేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. పాలకులు తమ సొంత పనులు చక్కబెట్టుకోవడంలో నిమగ్నమయ్యారని, పాత వాటికే రిబ్బన్లు కట్ చేస్తున్నారని విమర్శించారు. బుధవారం సాయంత్రం భద్రాచలంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం అయోధ్య జపం చేసే కేంద్రంలోని బీజేపీ పాలకులు, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం క్షేత్ర అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమని ఎంపీ రవిచంద్ర అన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాల మేరకు భద్రాచలం క్షేత్రంతో పాటు ఈ జిల్లా సమగ్రాభివృద్ధి గురించి పార్లమెంటులో పలుమార్లు లేవనెత్తానని పేర్కొన్నారు. భద్రాచలాన్ని ఆనుకుని ఉన్న 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని, రైల్వే మార్గాన్ని ఇక్కడి వరకు పొడిగించాలని, కొత్తగూడెంను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని పార్లమెంటులో ప్రస్తావించినట్లు వివరించారు. ఖమ్మం – కొత్తగూడెం – పాల్వంచ – భద్రాచలం మీదుగా బస్తర్ వరకు ఉన్న రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### అన్నదాతల పుట్టెడు దుఃఖం

ఇక రాష్ట్రంలో రుణమాఫీ కాక, రైతుభరోసా అందక, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు పుట్టెడు దుఃఖంతో రాలిపోతున్నారని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో విసిగిపోయిన ప్రజలు "రేవంత్ పోవాలి – కేసీఆర్ రావాలి" అని ముక్తకంఠంతో నినదిస్తున్నారని చెప్పారు. మొద్దునిద్రపోతున్న కాంగ్రెస్ సర్కారును బొందపెట్టేందుకు ప్రజలతో కలిసి ముందుకెళుతూ, కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమందరం అంకితభావంతో ముందుకు సాగాలని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.

